ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 4,401 మంది వెబ్‌ఆప్షన్ల నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో గురువారం 12,751 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 67,110 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. గురువారం నాటికి 4,401 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. వచ్చేనెల ఐదో వరకు ధ్రువపత్రాల పరిశీలన, ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విదేశీ పర్యటనకు రాష్ట్ర మంత్రులు, ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మెన్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ విదేశీపర్యటనకు బయలుదేరారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్, సింగపూర్‌లో ఉన్న పర్యాటక కేంద్రాలను అధ్యయనం చేయడానికి వెళ్లారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ రసమయి బాలకిషన్, ఇరిగేషన్ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, నీటిపారుదల శాఖ అధికారులు, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు దక్షిణ కొరియాలోని సియోల్ నగరం, సింగపూర్‌లలో ఉన్న అధునాతన పరిజ్ఞానంతో రూపొందించిన పర్యాటక ప్రదేశాలను సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయడానికి ఉన్నత స్థాయి బృందం గురువారం సాయంత్రం నుంచి జులై 7వ తేదీ వరకు విదేశీ పర్యటన కొనసాగనుంది. ఇదిలా ఉండగా విదేశీపర్యటనలో ఆయా పర్యాటక ప్రాంతాల్లో అధ్యయనం చేసిన అంశాలను మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో అమలు చేయనున్నారు. అందులో భాగంగానే మొట్టమొదటిసారిగా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న కేబుల్ బ్రిడ్జ్, రోప్‌వే, ట్యాంక్ బండ్‌లతో పాటు మ్యూజికల్ ఫౌంటెన్, లేజర్ షో, జెయింట్ వీల్, వేవ్‌పూల్, వాటర్ రైడ్స్, వాటర్ గేమ్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో ఇతర పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ శాఖ నిర్ణయించింది.

ఏళ్ల తరబడి నిరీక్షణ.. ఫలించనున్న వేళ..!

- గిరిజనులకు పోడు పట్టాల జారీకి సమాయత్తం
- నేడు సిఎం కెసిఆర్ చేతుల మీదుగా పంపిణీ
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,401 మందికి ప్రయోజనం
- గిరిజనేతరులకు తప్పని నిరాశ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న గిరిజనుల కల నేటికి నెరవేరనుంది. తాతల కాలం నుంచి అటవీ భూమిని నమ్ముకొని పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద గిరిజనులకు ఆ భూములపై హక్కులు అందనున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి కెసిఆర్ గిరిజన లబ్ధిదారులకు పోడు భూములకు సంబంధించి హక్కుపత్రాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం ఇక్కడి నుంచి లాంఛనంగా ప్రారంభించనుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లో గిరిజనులకు పోడుపట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,03,896 ఎకరాలకుగాను 37,401మందికి హక్కుపత్రాలు జారీ కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12.46లక్షల ఎకరాల పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకోగా.. ప్రభుత్వం 4,50,601లక్షల ఎకరాలకు సంబంధించి 1,50,012మంది లబ్ధిదారులకు హక్కుపత్రాలు జారీ చేయనున్నట్టు తెలిసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల భూములు నేటి నుంచి వారికి అధికారికం కానున్నాయి. అటవీ భూమినే ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న గిరిజనుల చింత తీరిపోనుంది.

పోడు భూములకు పట్టాలిస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇది వరకే ప్రకటించడంతో.. కిందటేడాది ఇందుకు సంబంధించి గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 2006అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13వ తేదీ నాటికి అటవీ భూముల్లో సాగులో ఉన్న వారికే హక్కుపత్రాలు లభిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులైన గిరిజన రైతులను ఎంపిక చేయడం వంటి ప్రక్రియలు పూర్తిచేసింది. నెల కిందటే హక్కు పత్రాలను సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో వాటిని పంపిణీ చేయలేదు. తొలుత ఈ నెల 24వ తేదీన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి పంపిణీ చేస్తామని ప్రచారం జరిగినా.. అనివార్య కారణాలతో పర్యటన రద్దయినట్టు తెలిసింది. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనంతోపాటు వివిధ అభివృద్ధి పనులను సిఎం ప్రారంభించనున్నారు. అక్కడే బహిరంగ సభలో పోడు భూముల హక్కుపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో 4.50లక్షల ఎకరాలకు హక్కులు

రాష్ట్రంలో 4,50,601 ఎకరాలకుగాను 1,50,012 మంది లబ్ధిదారులకు పోడు హక్కుపత్రాలు జారీ చేయనున్నట్టు తెలిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,401 మంది లబ్ధిదారులకు హక్కుపత్రాలను అందించనున్నారు. ఇందులో ఎక్కువగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే లబ్ధిదారులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో ఈ పోడు పట్టాలను జారీ చేయనున్నారు. పట్టాలు జారీ కావడంతో ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు తదితర పట్టాదారులకు దక్కాల్సిన ప్రయోజనాలన్నీ పోడుదారులకు లభించేందుకు ఆస్కారం ఉంటుంది. మరోవైపు జిల్లాల్లో ప్రతి ఏటా అటవీ అధికారులు, పోడుసాగుదారుల మధ్య జరుగుతున్న ఘర్షణలకు తెరపడనుంది. తాజాగా హక్కుపత్రాలు అందుకోనున్న గిరిజన రైతులకు ప్రభుత్వం రైతుబంధు డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిసింది.

గిరిజనేతరులకు నిరాశే..?

పోడు పట్టల పంపిణీ కోసం గిరిజనేతరులూ దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మూడు తరాలు (75ఏళ్లుగా) అటవీ భూములను సాగు చేసి ఉండాలని నిబంధన విధించింది. 1930కంటే ముందు నుంచి అటవీ ప్రాంతంలో ఉన్నట్టు ఆధారం చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పోడు పట్టాల కోసం 1.71లక్షల మంది గిరిజనేతరులు 4.36లక్షల ఎకరాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 1,02,606 ఎకరాల కోసం 32,119మంది గిరిజనేతరులు హక్కుపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం తాజాగా హక్కుపత్రాల పంపిణీలో వీరిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో అనేక మంది గిరిజనేతరుల్లో అసంతృప్తి కనిపిస్తోంది.

షూ వద్దు.. చెప్పులతోనే రావాలి

- రేపే గ్రూప్-4 రాతపరీక్ష
- 9.51 లక్షల మంది దరఖాస్తు
- 2,846 కేంద్రాల ఏర్పాటు
- సర్వంసిద్ధం చేసిన టిఎస్‌పిఎస్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-4 పోస్టులకు రాతపరీక్ష శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) సర్వంసిద్ధం చేసింది. శనివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2ను ఒఎంఆర్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అయితే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తారు. అభ్యర్థులు ఉదయం 9.45 గంటల్లోపు, మధ్యాహ్నం 2.15 లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత అభ్యర్థులను అనుమతించరు. పేపర్-1కు ఉదయం ఎనిమిది గంటల నుంచి పేపర్-2 కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందు భద్రతా సిబ్బందికి, గదిలోకి వెళ్లాక ఇన్విజిలేటర్‌కు ఫొటో గుర్తింపు కార్డును చూపించాలి. అభ్యర్థి కాకుండా వేరే వ్యక్తులు పరీక్షకు హాజరైనట్టు గుర్తిస్తే పోలీసు కేసు నమోదు చేయడంతోపాటు ఆ అభ్యర్థిని పరీక్షలకు అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈ పరీక్షకు అభ్యర్థులు భారీగా హాజరు కానుండడంతో వేలిముద్రను తప్పనిసరి చేశారు. అయితే బయోమెట్రిక్ ద్వారా హాజరును తీసుకోవడం లేదు. ఒఎంఆర్ పత్రంలో బ్లూ/బ్లాక్ పెన్‌తో పేరు, కేంద్రం కోడ్, హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ రాయాలి. హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ సరిగా రాయకున్నా, బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ కాకుండా ఇంక్‌పెన్, జెల్‌పెన్, పెన్సిల్ ఉపయోగించినా ఒఎంఆర్ పత్రం చెల్లుబాటు కానిదిగా గుర్తిస్తారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమోట్‌తో కూడిన కారు తాళాలు, విలువైన, నిషేధిత వస్తువులను అభ్యర్థులు తీసుకెళ్లకూడదు. అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి. షూ వేసుకుని రావొద్దంటూ టిఎస్‌పిఎస్‌సి సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టిఎస్‌పిఎస్‌సి జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-4కు రాష్ట్రవ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లను https://www.tspsc.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఉద్యమ గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం

- మృతదేహానికి సిఎం కెసిఆర్, మంత్రులు నివాళి
- అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు
- వేలాదిగా తరలి వచ్చిన అభిమానులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వేద సాయిచంద్ హఠాన్మరణం చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండలోని ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు వచ్చింది. దీంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం సాయిచంద్‌ను హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తదితరులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. సాయిచంద్ మృతదేహాన్ని గుర్రంగూడలోని నివాసానికి కుటుంబసభ్యులు తరలించారు.

గురువారం సాయిచంద్ నివాసంలో సిఎం కెసిఆర్.. ఆయన మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు. సాయిచంద్‌ను చూడగానే సిఎం కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిచంద్ భార్య రజనీ "సార్ సాయిని పిలువండి. లెమ్మనండి.. మీరు పిలిస్తే లేచివస్తాడు.. సార్.." అంటూ హృదయవిదారకంగా రోదించడంతో సిఎం భావోద్వేగానికి గురయ్యారు. సాయిచంద్ తండ్రిని సిఎం అక్కున చేర్చుకొని ఓదార్చారు. తానున్నానంటూ భరోసా ఇచ్చారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తరలివచ్చిన అభిమానులు

సాయి చంద్ మృతి విషయం తెలుసుకున్న అభిమానులు, కళాకారులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. సాయిచంద్ అమర్ హై అంటూ నినాదాలు చేస్తూ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ఈ సందర్భంగా మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, జోగినపల్లి సంతోష్ కుమార్, ఉద్యమ నాయకులు కోదండరామ్, కేశవరావు జావేద్, శంభుపూర్ రాజు, కౌశిక్ రెడ్డి, రసమయి బాలకిషన్, పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్, రాజయ్య, బాల్క సుమన్, ప్రకాష్‌గౌడ్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ప్రణాళిక సంఘం చైర్మెన్ వినోద్ కుమార్, ఎర్రోల్ల శ్రీనివాస్, మధుసూదనాచారి, అల్లం నారాయణ, ప్రజా గాయకులు గద్దర్, విమలక్క, సుద్దాల అశోక్ తేజ, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, నాగర్ కర్నూలు జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బాలాజీ సింగ్, తదితర ప్రజాప్రతినిధులు నివాళు లర్పించారు.

ముగిసిన అంత్యక్రియలు

సాయిచంద్ మృతదేహానికి బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో మంత్రులు నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరేశం, జెడ్‌పి చైర్మెన్ తీగల అనిత రెడ్డి, అధికార ప్రతినిధి దాసోజ్ శ్రవణ్, సిపిఎం నాయకులు జాన్‌వెస్లీ, చంద్రమోహన్, కిషన్, నరసింహారావు, భాస్కర్, యాదయ్య, నర్సిరెడ్డి, సాగర్, ఉద్యమకారులు మాధవరం నరసింహ, బిఆర్ఎస్ బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ నాయకుడు చంద్రకాంత్‌గౌడ్ పాల్గొన్నారు. శ్మశాన వాటిక వద్ద ఎల్బీనగర్ డిసిపి సాయిశ్రీ, వనస్థలిపురం ఎసిపి పురుషోత్తంరెడ్డి, వనస్థలిపురం సిఐ జలంధర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాయిచంద్ మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిచిన్న వయస్సులోనే మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలతో ప్రజలను ఉత్తేజపరిచారని తెలిపారు.

ప్రజాపంథా నివాళి

తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ గుండెపోటుతో మరణించడం బాధకరమని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. చిన్న వయస్సులో ఇలా అకాల మరణం పొందడం ఆయన కుటుంబానికి, సాంస్కృతిక రంగానికి తీరనిలోటని పేర్కొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనిది : న్యూడెమోక్రసీ

తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ ప్రజలను జాగృతం చేసిన తీరు, సామాజికంగా రాసి పాడిన పాటలు మరువలేనివని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె గోవర్ధన్ తెలిపారు. 39 ఏళ్లకే గుండెపోటుతో అకాల మరణానికి గురికావడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

మూడు పంటలకు నీళ్లందిస్తున్న ప్రాజెక్టులు

- మూడోసారి తుంగతుర్తి బీఆర్‌ఎస్‌దే..
- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సమైక్య పాలనలో రాళ్లు, ఇసుకతో దర్శనమిచ్చిన ప్రాజెక్టులు.. నేడు మూడు పంటలకు నీరందించేలా అభివృద్ధి చేసుకున్నాం.. సిఎం కెసిఆర్ ప్రజలకు కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారు" అని ఐటీ పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. తుంగతుర్తిలో మూడోసారి బిఆర్ఎస్‌దే విజయమని, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, సీసీరోడ్లు, డ్రెయినేజీ, ఆడిటోయిరం, మంచినీటి ట్యాంకులు, పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన బహిరంగ సభలో మంత్రి కెటిఆర్ ప్రసంగించారు. తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులు నాడు రాళ్లు, ఇసుక తిన్నెలు దర్శనం ఇస్తే.. నేడు మూడు పంటలకు నీరు అందిస్తున్నాయని చెప్పారు.

ఒకప్పుడు కక్షలు, రక్తపాతంతో అట్టుడికిన తుంగతుర్తి నియోజకవర్గం నేడు పచ్చటి పంట పొలాలతో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో మంత్రి జగదీశ్ రెడ్డి అండదండలతో రెండు లక్షల 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించుకోగలిగామని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 12 వేల కుటుంబాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా సాయం అందించామన్నారు. దళిత సోదరుల జీవితాల్లో దళితబంధు ద్వారా 10 లక్షల రూపాయలతో నూతన వెలుగు వచ్చిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ఆసరా పించన్ల ద్వారా ముసలవ్వలకు కెసిఆర్ పెద్ద కొడుకుగా ఆకలి తీరుస్తున్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.6500కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి ఎంపిక కావడంలో గాదరి కిషోర్‌కుమార్ పాత్ర ఉందన్నారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని నేడు మన ప్రభుత్వ పాలనలో తిరుపతికి ఎంత మాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు.

11.50 లక్షల ఎకరాల పోడుభూములకు హక్కు పత్రాలివ్వాలి

- అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం కెసిఆర్‌కు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలను కల్పిస్తామంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం 2005, డిసెంబర్ 13కు ముందు గిరిజనులు, ఇతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు కల్పించాలని వామపక్ష పార్టీలు, గిరిజన సంఘాలు అనేక ఏండ్లుగా పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. ఫలితంగా శుక్రవారం నుంచి పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలో 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలిస్తామంటూ సిఎం కెసిఆర్ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కేవలం నాలుగు లక్షల ఎకరాలను 1.50 లక్షల మంది గిరిజనులకు మాత్రమే హక్కు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడం సరైంది కాదని తెలిపారు. శాటిలైట్ మ్యాపుల పేరుతో కొత్తగా పోడు సాగు చేశారనే కారణాలతో నాలుగు లక్షల ఎకరాలకుపైగా దరఖాస్తులు చేసుకున్న లక్ష మంది గిరిజనుల దరఖాస్తులను కారణాలు తెలపకుండానే తిరస్కరించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ప్రభుత్వ ఆలోచనకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. తిరిగి పోడు భూముల సమస్య ఉత్పన్నం కాకుండా ఉండాలంటే 11.50 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలివ్వడమే పరిష్కారమని సూచించారు. ఒక్క గిరిజనేతరుడికీ హక్కు కల్పించబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని తెలిపారు. గిరిజనేతరులు ఇప్పటికే రెండు లక్షల దరఖాస్తుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకుపైగా హక్కు కల్పించాలంటూ విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు. వాటిని పరిశీలించకుండా గ్రామ సభల్లో చర్చించకుండా ఆయా దరఖాస్తులను తిరస్కరించారని తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం మూడు తరాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనేతరులకూ హక్కు పత్రాలివ్వాలని సూచించారు. అయినా పోడు భూముల పంపిణీలో వారికి అవకాశం లేకుండా చేయడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాజకీయ జోక్యాన్ని నివారించి పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. ప్రారంభం రోజు అట్టహాసంగా జరిగినా తర్వాత జరిగే హక్కుల పత్రాలను గ్రామసభల్లోనే పంపిణీ చేయాలని సూచించారు.

విద్యాపరమైన ఆలోచనలే విధాన నిర్ణయాలు కావాలి

- బిఇడి కోర్సుకు ఆదరణ తగ్గటం బాధాకరం
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. ఆర్ లింబాద్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాపరమైన ఆలోచనలన్నీ విధాన నిర్ణయాలకు దిశా నిర్దేశం ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ ఆర్ లింబ్రాద్రి అన్నారు. ఒయు విద్యా విభాగం ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన "ఎమర్జింగ్ పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యూకేషన్" అంశంపై జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ముఖ్యంగా బిఇడి కోర్సుకు ఆదరణ తగ్గడంపై ఆందోళన చెందారు. విద్యావ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను సిద్ధం చేసే బాధ్యత విశ్వవిద్యాలయ విద్యా విభాగానికి ఉంటుందని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 విద్యా విభాగం, దాని పనితీరుపై విపులంగా చర్చించిందని తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యలో తీసుకొచ్చిన మార్పులు రానున్న రోజుల్లో మంచి ఫలితాలు ఇస్తాయన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఓయు విసి ప్రొ డి రవీందర్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసే ఉపాధ్యాయులపై విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఓయూ ర్యాకింగ్‌లో స్వల్ప శాతంలో మార్పు రావడానికి అధ్యాపకుల కొరత కారణమని చెప్పారు. జాతీయ విధానాలకు దీటుగా ఓయూ పనిచేస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో దేశం నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు 295 పరిశోధన పత్రాలు సమర్పించారని, ప్రఖ్యాత సంస్థల నుంచి విషయ నిపుణుల ఆధ్వర్యంలో విద్యాపరమైన నూతన ఆలోచనలతో చర్చ జరిగిందని సెమినార్ కన్వీనర్ డాక్టర్ పారిపెల్లి శంకర్ తెలిపారు. సెమినార్ కో-కన్వీనర్ డాక్టర్ దుర్గేశం ఆధ్వర్యంలో ప్రతినిధులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ రామకృష్ణ, ప్రొ మృణాళిని, ప్రిన్సిపల్ ప్రొ రవీంద్రనాథ్, కె మూర్తి, డీన్ ప్రొ రాజేశ్‌కుమార్, డాక్టర్ లలిత, డాక్టర్ బి సుజాత, డాక్టర్ సునీత, డాక్టర్ దుర్గేశం, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ మధుకర్, డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలి

- ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి
- టిపిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని టిపిటిఎఫ్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొదటి పిఆర్‌సి గడువు శుక్రవారం (ఈనెల30)తో ముగుస్తున్నందున రెండో పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొదటి పిఆర్‌సిని ఆలస్యంగా అమలు చేయడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రెండో పిఆర్‌సి అయినా ఆలస్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. వచ్చేనెల నుంచి మధ్యంతర భృతి (ఐఆర్)ని ఇప్పుడున్న పెరిగిన ధరలకనుగుణంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. కేజీబీవీ టీచర్లకు రెగ్యులరైజ్ చేసి పే స్కేళ్లను వర్తింపజేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకుండా విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయులకు ఎనిమిదేండ్లుగా పదోన్నతులు కల్పించకుండా, ఐదేండ్లుగా బదిలీలు చేయకపోవడంతో పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యావ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

EYANTRA VENTURES LIMITED

(Formerly known as Punit Commercials Limited)
CIN: L72100TG1984PLC167149
Registered Office: 201,1st Floor, SM Reddy Complex, Image Garden Road
Cyber Hills Colony, VIP Hills, Madhapur, Telangana - 500081
Ph. No: +91 -7702974403,
E mail: support@eyantraventures.com, Website: www.eyantraventures.com

అసాధారణ సర్వసభ్య సమావేశం, రిమోట్ ఓటింగ్ సమాచారంకు సంబంధించిన నోటీసు

ఇయంత్ర వెంచర్స్ లిమిటెడ్ (గతంలో పునీత్ కమర్షియల్స్ లిమిటెడ్‌గా తెలిసినది) యొక్క సభ్యుల 2023-24 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి ఇజిఎం నోటీసులో పేర్కొన్న వ్యాపార కార్యకలాపాలను నిర్వహణకు కంపెనీ 2వ అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజిఎం) సోమవారం, 14 జులై, 2023న మ.3.00గం.లకు (ఐఎస్టీకి) వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసీ/ ఇతర ఆడియో విజువల్ పద్ధతుల (ఓఎవిఎం) ద్వారా నిర్వహించబడునని ఈ నోటీసు ద్వారా తెలియచేయటమైనది.
సర్క్యులర్ నెం.14/2020 తేదీ 08/2020, సర్క్యులర్ నెం. 17/2020 తేదీ ఏప్రిల్ 13,2020, 22/2020 తేదీ జూన్ 15, 2020, 33/2020 తేదీ సెప్టెంబర్ 28, 2020, 39/2020 తేదీ డిసెంబర్ 31, 2020 02/2021 తేదీ జనవరి 13, 2021, 10/2021 తేదీ జూన్ 23, 2021, 20/2021 తేదీ డిసెంబర్ 08, 2021, మరియు 11/2022, తేదీ డిసెంబర్ 08, 2022 (ఉమ్మడిగా 'ఎంసిఎ సర్క్యులర్‌లు'గా పేర్కొనబడును)తో పాటు సెబీ సర్క్యులర్ నెం. SEBI/HO/CFD/CMD1/CIR/P/2020/79 తేదీ మే 12, 2020, SEBI/HO/CFD/CMD2/CIR/P/2021/11 తేదీ జనవరి 15, 2021 (ఇకమీదట సెబీ సర్క్యులర్లుగా పేర్కొనబడును)తో కలుపుతూ ఎంసిఏ సర్క్యులర్ నెం.11/2022 తేది.28 డిసెంబర్, 2028, 20/2020 తేదిది.5 మే, 2020తో చదవగల ఎంసిఏ సర్క్యులర్ నెం.02/2021 తేది.13 జనవరి, 2021తో కంపెనీల చట్టం, 2013లోని వర్తించ నియమాలను అనుసరించి వీసి/ఓఎవిఎం ద్వారా ఇజిఎం నిర్వహించబడును. ఇజిఎంకు సభ్యుల భౌతిక హాజరు తప్పనిసరి కాదు. VC/OAVM ద్వారా ఇజిఎంకు హాజరు కాదలచుకున్న సభ్యులు ఇజిఎం నోటీసులో పొందుపర్చిన విధివిధానాలను అనుసరించాల్సి వుంటుంది.
పైన పేర్కొన్న సర్క్యులర్‌లలోని నియమ నిబంధనల మేరకు ఇజిఎం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలను కంపెనీ, రిజిస్ట్రార్, షేర్‌ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/డిపాజిటరీ పార్టిసిపెంట్స్ వద్ద తమ ఇ-మెయిల్ చిరునామాలను నమోదు చేసుకున్న సభ్యులందరికీ పంపే ప్రక్రియ 29.06.2023 నాటికి పూర్తయింది. అందువలన, ఇజిఎం నోటీసు యొక్క భౌతిక కాపీలు డిస్పాచ్ చేయబడలేదు. ఈ పత్రాలు కంపెనీ వెబ్‌సైట్: www.eyantraventures.com లో మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్‌అనగా బిఎస్ఇ లిమిటెడ్ www.bseindia.com లో మరియు సిడిఎస్ఎల్ వెబ్‌సైట్ (రిమోట్ ఇ-ఓటింగ్ వసతిని కల్పించుటకు ఏజెనీ) :www.evotingindia.com లో కూడా అందుబాటులో వున్నాయి.
2013 నాటి కంపెనీల చట్టంలోని సెక్షన్ 108తోపాటు సమయానుకూలంగా సవరించబడిన కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్ 2014లోని రూల్ ప్రకారం కంపెనీ షేర్‌హోల్డర్లకు ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించేందుకు కంపెనీ సెంట్రల్ డిపాజటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ సేవలను వినియోగించుకుంటోంది. కటాఫ్ తేదీ అనగా సోమవారం, 17 జులై, 2013 (కటాఫ్ తేది) నాటికి కంపెనీ యొక్క చెల్లించిన ఈక్విటీ వాటామూలధనంలో వారు నిర్వహించిన ఈక్విటీ వాటాల నిష్పత్తిలో సభ్యుల ఓటింగ్ హక్కులు ఉంటాయి.
సభ్యులకు ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా...

1. ఇజిఎం నోటీసులో పొందుపర్చిన వ్యాపార లావాదేవీలు ఇజిఎంలో రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టమ్స్ ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించటం జరుగుతుంది.
2. రిమోట్ ఇ-ఓటింగ్ శుక్రవారం, 21 జులై, 2023 ఉ.9-00 గంటలకు ఐఎస్టీకి నుండి ప్రారంభమై ఆదివారం, 23 జులై, 2023 సా.5.00 గంటలకు ముగుస్తుంది. ఒక్కసారి తీర్మానంపై సభ్యులు ఓటు వేసిన తరువాత, దానిని మార్పు చేసుకునేందుకు అనుమతించబడరన్న విషయాన్ని సభ్యులు గమనించాలి.
3. సిడిఎస్ఎల్‌చే రిమోట్ ఇఓటింగ్ మోడ్యుల్ 23.07.2023న సా.5.00గం.ల తరువాత నిలిపివేయబడును.
4. ఇజిఎం సమయంలో ఇఓటింగ్ కొరకు వసతి అందుబాటులో ఉండును మరియు అటి సభ్యులు, వీసి ద్వారా ఇజిఎంలో పాల్గొంటున్న మరియు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానాలపై వారి ఓటును వేయని మరియు అలా చేయుట నుండి నిషేదించబడినవారికి ఇజిఎం సమయంలో ఓటును పొందుటకు అర్హులు. ఇజిఎంకుముందు రిమోట్ ఇఓటింగ్‌చే వారి ఓటును వినియోగించన సభ్యులు ఇజిఎంలో పాల్గొనవచ్చు/ హాజరు కావచ్చును కానీ మళ్లీ ఓటుకు అనుమతి ఉండదు.
5. డిమేటిరియలైజ్డ్ రూపంలో షేర్లుకలిగి వున్న సభ్యులు, ఇ-మెయిల్ అడ్రస్‌లు నమోదు చేసుకోని సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకునే పద్ధతి ఇజిఎం నోటీసులో పేర్కొనబడినది.
6. సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్ వద్ద ఇ-మెయిల్ అడ్రస్‌లు నమోదు చేసుకోని సభ్యులు ఇజిఎం నోటీసు కాపీలును స్వీకరించుటకు కంపెనీ'స్ రిజిస్ట్రార్& షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్, లింక్‌ఇన్‌టైమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ mumbai@linkintime.co.inలో వారి ఇ-మెయిల్ అడ్రస్‌లను అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా సూచించబడు తున్నారు.

న్యాయమైన & పారదర్శక పద్ధతిలో ఇజిఎం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ ప్రక్రియ మరియు ఓటింగ్‌ను పర్యవేక్షించుటకు స్క్రూటినైజర్‌గా మెసర్స్ వివేక్ సురానా & అసోసియేట్స్, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీస్ (ఐసిఎస్ఐ మెంబర్‌షిప్ నెం.ఏసిఎస్24531) వారిని కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నియమించారు. స్క్రూటినైజర్ నివేదికతోపాటు ఇజిఎం ఓటింగ్ ఫలితాలను సమావేశం ముగిసిన 48 గంటలలోగా కంపెనీ వెబ్‌సైట్: www.eyantraventu res.com లో ప్రదర్శించటంతో పాటు స్టాక్‌ఎక్స్ఛేంజ్‌కు కూడా తెలియచేయబడతాయి.
ఎవరైనా వ్యక్తి కంపెనీ ఇజిఎం నోటీసు పంపిన తరువాత కటాఫ్ తేదీకి ముందు కంపెనీ షేర్లను కొనుగోలు చేసి కంపెని సభ్యుడిగా మారితే అటువంటి వారు helpdesk.evoting@cdslindia.com వద్ద అభ్యర్థను పంపించుట ద్వారా లాగిన్ ఐడి& పాస్‌వర్డ్‌ను పొందవచ్చును. అయితే రిమోట ఇ-ఓటింగ్ కోసం సిడిఎస్ఎల్‌తో ఇప్పటికే తమ వివరాలను నమోదు చేసుకున్న సభ్యుడు తమ వద్ద వుండే యూజర్‌ఐడి& పాస్‌వర్డ్‌ను ఉపయోగించి ఓటును వేయవచ్చును.
ఇ-ఓటింగ్‌కు సంబంధించిన సందేహాలు ఏవైనా వుంటే www.evotingindia.com లో హెల్ప్ సెక్షన్‌లో వుండే తరచు అడిగే ప్రశ్నలు (ఎఫ్ఎక్యూ) సందర్శించవచ్చు లేదా helpdesk.evoting@cdslindia.com ద్వారా ఇ-మెయిల్ పంపవచ్చు లేదా 1800225533 పై కాల్ చేయవచ్చు లేదా సంప్రదించండి: శ్రీ రాకేష్ దాల్వీ, సినియర్ మేనేజర్ (సిడిఎస్ఎల్), సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్, ఏ వింగ్, 25వ ఫ్లోర్, మారథాన్ ఫ్యూచరెక్స్, మఫత్‌లాల్ మిల్ కాంపౌండ్స్, ఎన్ఎం జోషి మార్గ్, లోయర్ పరేల్ (ఈస్ట్), ముంబయి 400013.

బోర్డు ఉత్తర్వుల మేరకు
For Eyantra Ventures Limited
సం/-
ప్రియాంక గట్టని
కంపెనీ సెక్రటరీ & కాంప్లియన్స్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 29.06.2023

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై ప్రధాని స్పందించాలి

- వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కావాలనేది 40 ఏళ్ల డిమాండ్ అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇస్తామని గత ప్రభుత్వాలు చెప్పాయని, ఏర్పాటు ప్రక్రియ ఆలస్యం కావడంపై గతంలో ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. గతంలో కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీలు వేరే రాష్ట్రాలకు తరలి వెళ్లాయన్నారు. జులై 8న ప్రధాని మోదీ కాజీపేట పర్యటనలో కోచ్ ఫ్యాక్టరీపై స్పందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల హయాంలో రైల్వే శాఖ మంత్రి ఏ ప్రాంత వాసి అయితే.. ఆ రాష్ట్రానికి కోచ్ ఫ్యాక్టరీలు కేటాయించారని ఆరోపించారు.

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలని విభజన చట్టంలోనూ ఉందని గుర్తు చేశారు. దాన్ని కాదని గతంలో వేరే రాష్ట్రంలో కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. "గతేడాది గుజరాత్‌లో ఎన్నికల సందర్భంగా కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. మహారాష్ట్రలో బిజెపి అధికారంలో ఉన్న సమయంలో అక్కడ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కాకుండా.. పీరియాడికల్ ఓవర్ హాలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. వ్యాగన్లు శుభ్రం, మరమ్మత్తు చేసే ఓవర్ హాలింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రధాని రావడం ఆశ్చర్యంగా ఉంది " అని వినోద్ కుమార్ అన్నారు.

కార్యక్రమంలో స్టేఫ్రీపై అవగాహన చెబుతున్న పివి సింధు

రుతుక్రమం కలలకు అడ్డుకాదు

- బ్యాడ్మింటన్ పివి సింధు

హైదరాబాద్ : మహిళలు తమ కలలను నేరవేర్చుకునే క్రమంలో రుతుక్రమం అడ్డుకాదని ప్రముఖ బ్యాడ్మింటన్ పివి సింధూ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో రిలయన్స్ రిటైల్ స్టోర్‌లో స్టేఫ్రీ సెక్యూర్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో సింధు తన అభిమానులతో మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'స్టేఫ్రీ ఎల్లప్పుడూ మహిళా సాధికారతకు ఛాంపియన్‌గా ఉందన్నారు. చింతించకుండా సుఖంగా నిద్రపోయేలా చేస్తుందన్నారు. రుతుస్రావం సమయంలో యువతులు ముఖ్యంగా మహిళా అథ్లెట్లు ఎదుర్కొనే సవాళ్లు, పీరియడ్స్ సమయంలో కావలసిన నాణ్యమైన నిద్ర అవసరం, రుతు పరిశుభ్రత ప్రాముఖ్యతలపై సింధు మాట్లాడారు.

గన్ మిస్ ఫైర్.. సెక్యూరిటీ గార్డు మృతి..

- మింట్ కాంపౌండ్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గన్ మిస్ ఫైర్ అయ్యి సెక్యూరిటీ గార్డు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..

మింట్ కాంపౌండ్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కానిస్టేబుల్ రామయ్య(46) గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ అయింది. బుల్లెట్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన రామయ్యను నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రామయ్య స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వ్యక్తి. సైఫాబాద్ పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై ప్రింటింగ్ ప్రెస్‌లోని సెక్యూరిటీ సిబ్బందిని సైఫాబాద్ ఏసిపి సంజయ్ కుమార్, సిఐ సత్తయ్య ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయివేటు బస్సు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తు బోల్తా పడింది. 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి వరంగల్ వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఉదయం బిబినగర్ ప్రాంతంలో ఎదురుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది, డ్రైవర్ చాకచక్యంతో పెన్ను ప్రమాదాన్ని తప్పించారు. సుమారు 30 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అద్దాలు పగలగొట్టి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ఎస్ఐ యుగేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రేపటికి నుంచి ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం

ప్రజాశక్తి - కల్చరల్

విఖ్యాత సాహితీవేత్త శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ జన్మదిన సందర్భంగా శ్రీ త్యాగరాయ గాన సభ నిర్వహణలో ఆయన సాహితీ సప్తాహం ఒకటి నుంచి 7వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కళాసుబ్బారావు కళావేదికపై జరుగునుంది ఇందుకు సంబంధించిన వివరాలను గాన సభ సమావేశ మందిరంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి తెలిపారు. ఇనాక్ త్యాగరాయ గాన సభతో ఎంతో అనుబంధం ఉందని ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టత దృష్టిలో వుంచుకొని సాహిత్య సప్తాహం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు రోజు కొకటి ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం, వలస, దిక్కులేనోడు శూన్యం, విమర్శిని, పాలి,ఆల్మ్ ఆఫ్ పార్ధన్ సంపుటి లను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ,ప్రముఖ సాహితీవేత్త నందిని సిద్ధ రెడ్డి, శాసన సభ తొలి సభాపతి సిరికొండ మధు సూదనాచారి, మాజీ మంత్రి మండలి బుధ ప్రసాద్,గ్రంధాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరి శంకర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆవిష్కరిస్తారని తెలిపారు వివిధ రంగ ప్రముఖులు అతిథులు గాప్రతి రోజూ హాజరు అయ్యే కార్యక్రమాలకు తొలుత సాంస్కతిక ప్రదర్శనలు వుంటాయి. విలేకరుల సమావేశంలో గుండవరపు గీతా దేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు

వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు గెలుస్తాం

- ఇప్పటివరకు చూసింది ట్రైలరే.. అసలు సినిమా ముందుంది
- క్రెడాయ్ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదేండ్లలో మీరు చూసింది ట్రైలరే అని.. అసలు సినిమా ముందు ఉందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. హైదరాబాద్ జర్నీ ఇప్పుడే మొదలైందని.. కెసిఆర్ మనసులో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయని ఆయన తెలిపారు. నానక్‌రామ్‌గూడలో క్రెడాయి కార్యాలయాన్ని మంత్రి కెటిఆర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాటలు చెప్పడం సులభమేకానీ.. తొమ్మిదేండ్లలో ఎక్కడ ఉన్న తెలంగాణ ఎక్కడికి వచ్చిందో ఆత్మవలోకనం చేసుకోవాలని మంత్రి కెటిఆర్ అన్నారు. విపక్షాల మాటలు కోటలు దాటుతాయిగానీ, కాళ్లు మాత్రం గడప దాటడంలేదని ఎద్దేవా చేశారు. 60 ఏండ్లలో కాని పనులు తొమ్మిదేండ్లలో పూర్తికావడానికి సమర్ధవంతమైన కెసిఆర్ నాయకత్వం, సుస్థిరమైన ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు.

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో చాలా మంది చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన కొత్తలో జరిగిన ఎన్నికల్లో 63 సీట్లే వచ్చాయి. ఒక్క పది మందిని అటు ఇటు చేస్తే వెంటనే ప్రభుత్వం ఆగమైతది.. తెలంగాణ ఫెయిల్డ్ ఎక్సపర్మెంట్ అవుతదని తెలంగాణ వ్యతిరేకులు చాలా ప్రయత్నాలు చేశారు. 2023లో జరిగే ఎన్నికల్లో 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తామని సంపూర్ణ విశ్వాసం ఉంది.' అని ధీమా వ్యక్తం చేశారు.

గచ్చిబౌలి, కొండాపూర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని పెద్ద బిల్డింగ్‌లు చూసి ఇది హైదరాబాదా? న్యూయార్క్ నగరమా అని అనిపించిందని సూపర్‌స్టార్ రజినీకాంత్ చెప్పారని మంత్రి కెటిఆర్ గుర్తు చేశారు. 'రజినీకాంత్ ఉండేది మనకంటే పెద్ద నగరమైన చెన్నైలో.. ఆయన సూపర్ స్టార్ వంద దేశాలు తిరిగి ఉంటండు. మరి ఆయనకు హైదరాబాద్‌ను చూస్తే అలా అనిపించింది. ఆయన ఒక్కడికే కాదు.. ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసేందుకు ఫాక్స్‌కాన్ చైర్మన్ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయన ఇది ఇండియానేనా అని ఆశ్చర్యపోయారు. వేరే ఏదో దేశంలో ఉన్నామని అనుకున్నట్లు చెప్పారు' అని అన్నారు. హైదరాబాద్, తెలంగాణలో ఉన్నోళ్లకే ఇక్కడి పరిస్థితి అర్థం కావడం లేదని మంత్రి కెటిఆర్ అన్నారు. వాళ్లు ఒక్కడుగు బయటకు పోయి మళ్లొస్తేనే మన కథేంటో అర్థమైతదని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రకో, కర్ణాటకకో, గుజరాత్‌కో, ఇంకో రాష్ట్రానికో వెళ్లి అక్కడ పది రోజులు ఉండొస్తే మన రాష్ట్రం గొప్పదనం అర్థమవుతుందని అన్నారు.

తొమ్మిదేండ్లలో చూసింది ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా ముందుంది.. తొందరపడకండని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఇదేదో ఎన్నికల్లో లాభం కోసం చెప్పడంలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ జర్నీ ఇప్పుడే మొదలైందని.. ఇంకా బుడిబుడి అడుగులే వేస్తున్నామని.. సిఎం మనసులో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు ఉన్నప్పుడు ప్రొ ఐటి, ప్రొ బిజినెస్ టైప్‌లో పాలన ఉండేదని మంత్రి కేటీఆర్ అన్నారు. సిఎం కాదు..సిఇఒ అంటే ఆయనకు నచ్చేదని గుర్తు చేశారు. రాజశేఖర్‌రెడ్డికి ప్రొ ఫార్మర్, ప్రొ పూర్, ప్రొ రూరల్ ఇమేజ్ ఉండేదన్నారు. కెసిఆర్ పాలనలో ఆ రెండూ ఉన్నాయని.. అదే కెసిఆర్ ప్రభుత్వం ప్రత్యేకత అని తెలిపారు.

10 నుంచి టోకెన్ సమ్మె

- మధ్యాహ్న భోజన కార్మికులు జయప్రదం చేయాలి
- పాలడుగు భాస్కర్

కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె చేయనున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఆ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశం ఇందూరు సులోచన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. దేశంలో సగం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారని, వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడు తోందని చెప్పారు. డ్రాపౌట్స్ తగ్గి చదుకునే పిల్లల సంఖ్య పెరగడానికీ, సామాజిక సమానత్వం కాపాడటానికి ఈ పథకం ఎంతో దోహదపడుతున్నదని చెప్పారు. ఇలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తు న్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి అమలు చేస్తే మరెన్నో ఫలితాలు పొందవచ్చునని అన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 54201 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులు 25 వేల పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారన్నారు. పెరిగిన ధరలతో పోల్చితే గతంలో కేటాయించిన బడ్జెట్ సరిపోవడంలేదని తెలిపారు. ధరల పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 2022 బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి రూ.మూడు వేలకు పెంచుతామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ, ఇప్పటివరకూ రూ. మూడు వేల గౌరవ వేతనం ఇచ్చింది లేదన్నారు. అసెంబ్లీలో ప్రకటన చేసినప్పటి నుంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలనీ, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూని సవరించాలనీ, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎజె రమేష్, నాయకులు ఆర్ శ్రీనివాస్, రాజు, దీప్లానాయక్, రమ్య, కృష్ణమాచారి, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సిహెచ్. ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, సరస్వతి, నరసమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి కళావతి, చామంతి లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సంగీత నృత్యోత్సవ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-కల్చరల్

నవ్య నాటక సమితి నిర్వహణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతీయ సంగీత నృత్య పోటీలు గత నలభై ఏడు వత్సరాలు గా జరిగాయి. కారోనా కారణంగా గత మూడు వత్సరాలు జరుగలేదు. ఈ వత్సరం 48 వ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ నివాస కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన గోడ పత్రిక ను అవిష్కరించి మాట్లాడారు. దేశ సమగ్రతకు ఐక్యతకు కళలు వారధి అన్న ఆశయం తో వేమరాజు నరసింహ రావు జాతీయ స్థాయిలో సంగీత నత్య పోటీలు 1961 లో వికె డుగే శేష గిరిరావు, నిరంజన్ షా వంటి వారి సౌజన్యం తో ఆరంభించగా ఆ సంప్రదాయాన్ని కుమారుడు విజయ కుమార్ తన బృందంతో కోనసాగించడం హర్షనీయమన్నారు. ఆగస్ట్ 26 నుంచి సెప్టెంబర్ మూడు వరకు ఎనిమిది రోజుల పాటు జరిగే పోటీలలలో ప్రవర్ధమాన కళాకారులు దేశం నలుమూలల నుంచి పాల్గొనవచ్చునన్నారు. విజయ కుమార్ పోటీ వివరాలు తెలుపుతూ కర్ణాటక సంగీతంలో గాత్ర, వీణ, వాయులీనం, మృదంగం విభాగాలలో హిందుస్తానీ సంగీతంలో గాత్ర, సితార్, తబలలో పోటీలు ఉంటాయన్నారు. నృత్యంలో భారత నాట్యం, ఆంధ్రనాట్యం, కూచిపూడి, కథక్‌లలో పోటీలు వుంటాయని తెలిపారు. 17 ఏళ్ల నుంచి న23 ఏళ్ల మధ్యన సీనియర్లుగా, 13 ఏళ్ల నుంచి 16 ఏళ్ల మధ్యన జూనియర్స్‌గా ఎనిమిది ఏళ్ల నుంచి 12 ఏళ్ల మధ్య సబ్ జూనియర్స్‌గా విభాగించామన్నారు. దరఖాస్తులు హైద్రాబాద్‌లోని నారాయణ గూడ వైఎంసిఎలోని నవ్య నాటక సమితి కార్యాలయంలో 500 రూపాయల ప్రవేశ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చునని ఇవి పాల్గొనే వారి వసతి భోజన సదుపాయం సౌకర్యాలు కోసం అని తెలిపారు. దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. ప్రదర్శించవలసిన అంశాలు దరఖాస్తుతో పాటు బుక్‌లెట్‌లో ఉన్నాయన్నారు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సుధామాల మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగె ఈ పోటీలలో గతంలో ప్రస్తుత పద్మ భూషణ్ అవార్డ్ గ్రహితలు రాధా రెడ్డి రాజా రెడ్డిలు తొలి నాళ్లల్లో పోటీలలో పాల్గొన్నారని ఇలా ఎందరో పోటీలలో పాల్గొన్నవారు నేడు దేశ విదేశాల్లో పేరుపొందిన కళాకారులుగా ఉన్నరని తెలిపారు. ఆకుల రజిత్, వసుంధర,చలపతి శాస్త్రి, వాస గోపినాధ్ పాల్గొన్నారు సంగీతం పోటీలు హైద్రాబాద్ లోని రాం కోటిలోని కృష్ణ భాషా నిలయంలో, నృత్య పోటీలు బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వుంటాయి ఇతర సమాచారం కోసం 8919792216/9908625949 ద్వారా తెలుసుకోవచ్చు.

శేజల్ మరోసారి ఆత్మహత్యాయత్నం

- జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద అపస్మారక స్థితిలో..
- బెల్లంపల్లి ఎమ్మెల్యే వేధించారని పోరాడుతున్న శేజల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను లైంగికంగా వేధించడాంటూ కొన్ని రోజులుగా ఆరోపణలు చేస్తున్న శేజల్ అనే యువతి మరోసారి ఆత్మహత్యకు యత్నించింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి వద్ద ఆమె అపస్మారక స్థితిలో పడిపోయి కనిపించింది. ట్రాఫిక్ పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. శేజల్ బ్యాగులో నిద్రమాత్రలు లభ్యమైనట్టు సమాచారం. దాంతో ఆమె నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్టు తెలుస్తోంది. పోలీసులు సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఆత్మహత్యకు యత్నించడం మూడోసారి.

సూసైడ్‌నోట్‌లో కీలక అంశాలు..

శేజల్ రాసిన సూసైడ్‌నోట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. తనకు ఎవరూ న్యాయం చేయలేకపోయారని.. పెద్దమ్మతల్లి అయినా న్యాయం చేయాలని ఆ సూసైడ్ లెటర్‌లో రాసి ఉంది. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను కొన్ని నెలలుగా లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ న్యాయపోరాటం చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఎన్నాళ్లకైనా మంత్రులు తన ఆవేదనను అర్థం చేసుకుంటారని భావించినప్పటికీ అది జరగలేదని వెల్లడించింది. తాను ఇదివరకు ఢిల్లీలోని సిఎం కెసిఆర్ ఇంటి ముందు నిరసన తెలిపిన సమయంలో మంత్రి కెటిఆర్ పిలిచి మాట్లాడారని పేర్కొంది. అక్కడే ఉన్న ముగ్గురు అధికార పార్టీ పెద్దలు తనకు న్యాయం చేస్తారని చెప్పారని, దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపింది. అంతేకాదు తనపై, తన కుటుంబ సభ్యులపై పెట్టిన అక్రమ కేసులనూ ఎత్తేయిస్తామని చెప్పినట్టు లేఖలో ఉంది. తమకు భూమి ఇచ్చి.. తమ వద్ద నుంచి తీసుకున్న డబ్బులు కూడా తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొంది. అవేమీ వారు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ పేర్కొంది. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నారని రాసింది. ఎవరు వచ్చి ఎప్పుడు చంపుతారో అనే భయం తనను వెంటాడుతోందని.. తనకు ఇక న్యాయం జరగదని.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు లేఖలో పేర్కొంది. తాను చనిపోయిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని.. అందుకే సూసైడ్ లెటర్ రాస్తున్నట్టు వివరించింది.

స్పృహ కోల్పోయిన శైజల్, ఆమెను వేదింపులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

సిఎం మహారాష్ట్రకా? తెలంగాణకా?

బిఆర్ఎస్‌కు రబ్బరు స్టాంపు గవర్నర్లే నచ్చుతారు: బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ సిఎంగా ఉన్నది మహారాష్ట్రకా? తెలంగాణకా? అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సిఎం కెసిఆర్ అందుబాటులో ఉండట్లేదు కాబట్టే ప్రజలు రాజ్‌భవన్‌వైపు చూస్తున్నారని చెప్పారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్ తమిళి సైపై రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవినీతి జరుగుతుంటే గవర్నర్ చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. రబ్బరు స్టాంపులా ఉండే గవర్నర్లే బిఆర్ఎస్‌కు నచ్చుతారని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్‌ను తాగి, తినడానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. అంతకుముందు బండి సమక్షంలో మాజీ డిజిపి ఎస్‌కె జయచంద్ర, ఆయన కుమార్తె పాయల్ నేహ బిజెపిలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎన్ రామచంద్రరావు, ఉపాధ్యక్షులు జి మనోహర్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గీతామూర్తి, అధికార ప్రతినిధులు ఎన్‌వి సుభాష్, జెనవాడే సంగప్ప పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రెడీ..

- దమ్ము, ధైర్యం ఉంటే బిఆర్ఎస్ పాలకులు రావాలని భట్టి సవాల్..
- 2న ఖమ్మం బహిరంగ సభకు తరలిరండి

పీపుల్స్ మార్చ్ యాత్రలో సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేపట్టిన ఇందిర, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు పనులు కాంగ్రెస్ హయాంలోనే 80 శాతం పూర్తయ్యాయని, మరో రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే మిగతా 20శాతం పనులు పూర్తయి నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కానీ ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో రూ.25 వేల కోట్లకు బడ్జెట్ పెంచి పదేళ్లు కావస్తున్నా ఒక్క ఎకరానికి కూడా చుక్క నీరు ఇవ్వని బిఆర్ఎస్ వైఫల్యంపై తాను చర్చకు సిద్ధమని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. ఈ అంశంపై మాట్లాడడానికి దమ్ము, ధైర్యం ఉంటే బిఆర్ఎస్ పాలకులు చర్చకు రావాలని సవాల్ చేశారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో ఖమ్మం జిల్లాకు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. పాలేరు నియోజకవర్గ ప్రజల ఓట్లను కాంట్రాక్టుల కోసం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కెసిఆర్ వద్ద అమ్మేశాడని ఆరోపించారు. గతంలో పాలేరు నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన సంభాని చంద్రశేఖర్, రామ్‌రెడ్డి వెంకట్ రెడ్డి లాంటి నేతలు ఏనాడు ప్రజల ఓట్లను అమ్ముకోలేదన్నారు. కందాల ఉపేందర్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారని, నాలుగు నెలలు ఆగితే తనని, తన పార్టీని పాలేరు ప్రజలు బంగాళాఖాతంలో పడేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాదయాత్రకి ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులను అర్ధరాత్రి అరెస్ట్ చేసిన ఎసిపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు పోలీస్ మాన్యువల్ ప్రకారం పనిచేయకుండా సంఘ విద్రోహ శక్తులను అరెస్టు చేసినట్టు కాంగ్రెస్ నాయకుల ఇంటికి వెళ్లి వారిని ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకు రావాలని ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా జులై రెండున ఖమ్మంలో నిర్వహించే జనగర్జన సభకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. ఇదే సభలో ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరిక ఉంటుందన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుర్గా ప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు జెడ్‌పి మాజీ చైర్మెన్ చందా లింగయ్య, అసీవుద్దిన్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంజయ్య భవన్ ముట్టడిని జయప్రదం చేయాలి

- వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సెక్యూరిటీ సర్వీసెస్‌కు సంబంధించిన కనీస వేతనాల జిఒ 21 విడుదలై రెండేళ్లవుతున్నా గజిట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్ (రాష్ట్ర కార్మిక శాఖ ప్రధాన కార్యాలయం)ను ముట్టడించనున్నట్టు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ (సిఐటియు అనుబంధం) తెలిపింది. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల సాంబయ్య, యాటల సోమన్న ఒక ప్రకటన విడుదల చేశారు. 28 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సుమారు 1,200 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కనీస వేతనాల్లేక వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.